జాతీయ తెలుగు దినపత్రిక

RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు

తెలుగు పత్రికా రంగంలో నూతనంగా అడుగుపెట్టి విశేష ప్రజాదరణతో ముందుకు సాగుతున్న మన 'సందేశం టైమ్స్' తెలుగు దిన పత్రికలో పని చేయుటకు రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి స్టాఫ్ రిపోర్టర్స్ కావలెను. అలానే మండల స్థాయి రిపోర్టర్స్ కావలెను.కొత్త వారికీ అవకాశం కలదు

ఎడిటర్ : 90520 45435

PUBLISHED: TG & AP సంపుటి : 1 సంచిక: 171 సోమవారం 17 నవంబర్- 2025 పేజీలు : 4 వెల 2 /-

Published from :Adilabad, Bhadradri Kothagudem, Hanumakonda, Hyderabad, Jagtial, Jangaon, Jayashankar Bhupalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahbubnagar, Mancherial, Medak, Medchal-Malkajgiri, Mulugu, Nagarkurnool, Nalgonda, Narayanpet, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Ranga Reddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal, and Yadadri Bhuvanagiri.

## ప్రపంచంలోకెల్లా
## భారతీయ కుటుంబ వ్యవస్థ చాలా గొప్పది: సీఎం చంద్రబాబు



అమరావతి, నవంబరు16 (సందేశం టైమ్స్): భారత రాజ్యాంగం అందించే స్ఫూర్తి చాలా గొప్పదని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. అద్భుతమైన రాజ్యాంగాన్ని బీఆర్ అంబేద్కర్ మనకు రూపొందించి ఇచ్చారని ఉద్ఘాటించారు. ఓ ఛాయ్ వాలాగా ఉన్న నరేంద్రమోదీ ... దేశానికి అత్యుత్తమ ప్రధాని కాగలిగారు అంటే అది మన రాజ్యాంగం గొప్పదనమని అభివర్ణించారు. ఇవాళ(ఆదివారం) గుంటూరు జిల్లాలో జరిగిన భారత రాజ్యాంగ సదస్సులో సీఎం చంద్రబాబు పాల్గొని ప్రసంగించారు. రాబోయే రోజుల్లో ప్రపంచానికి భారతదేశం అన్నిరంగాల్లో నిపుణులను అందిస్తుందని వివరించారు. 2014లో 11వ స్థానంలో ఉన్న భారతదేశం క్రమంగా అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రపంచంలోనే నాల్గోవ లార్జెస్ట్ ఎకానమీగా భారతదేశం ఎదిగిందని నొక్కిచెప్పారు. 2047 కల్లా ప్రపంచంలో ఆర్థికంగా అత్యంత ప్రభావవంతమైన దేశంగా భారతదేశం మారుతోందని వెల్లడించారు. వ్యవస్థలోని లోపాలను సరిదిద్ది ప్రజాస్వామ్యాన్ని అమలు చేయడంలో న్యాయవ్యవస్థ అత్యంత కీలక బాధ్యత వహిస్తోందని చెప్పుకొచ్చారు సీఎం చంద్రబాబు. తొలుత ప్రింట్ మీడియా ... ఆ తర్వాత ఎలక్ట్రానిక్ మీడియా.. ఇప్పుడు సోషల్ మీడియా వచ్చిందని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో ప్రతి ఒక్కరూ వారి అభిప్రాయాలు తెలియజేస్తున్నారని పేర్కొన్నారు. సోషల్ మీడియా ద్వారా కొంతమంది వ్యక్తి హననానికి పాల్పడటం దురదృష్టకరమని తెలిపారు. ప్రపంచంలోకెల్లా భారతీయ కుటుంబ వ్యవస్థ చాలా గొప్పదని ఉద్ఘాటించారు. హెల్తీ హ్యాపీ సొసైటీ స్థాపనే రాజ్యాంగం లక్ష్యమని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## ఏపీ ప్రభుత్వ ప్రజాహిత చర్యలు అభినందనీయం: సీజేఐ గవాయ్



అమరావతి, నవంబరు16 (సందేశం టైమ్స్): భారత రాజ్యాంగానిది 75 ఏళ్ల విజయవంతమైన ప్రస్థానమని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్ వ్యాఖ్యానించారు. రాజ్యాంగం గొప్పదనం గురించి మాట్లాడే అవకాశం తనకు రావడం చాలా గొప్ప విషయమని పేర్కొన్నారు. తన స్వస్థలం మహారాష్ట్రలోని అమరావతి అని తెలిపారు. తన న్యాయవాద ప్రస్థానం అమరావతిలో ప్రారంభమైందని ఉద్ఘాటించారు.భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఇవాళ(ఆదివారం) ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో సీకే కన్వెన్షన్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్ , ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకుర్, హైకోర్టు న్యాయమూర్తులు, అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, పలువురు న్యాయవాదులు హాజరయ్యారు. 'ఇండియా అండ్ ది లివింగ్ ఇండియన్ ఇన్‌స్టిట్యూషన్ ఎట్ 75 ఇయర్స్' అనే అంశంపై ప్రసంగించారు జస్టిస్ గవాయ్.

అమరావతికి రావడం నాకు సంతోషంగా ఉంది..

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా తనను నియమించిన తర్వాత తొలిసారిగా ఏపీ రాజధాని అమరావతికి వచ్చానని చెప్పుకొచ్చారు. అమరావతికి రావడం తనకు చాలా సంతోషంగా ఉందని పేర్కొన్నారు. అమరావతికి గొప్ప చారిత్రాత్మక గుర్తింపు ఉందన్నారు. మహారాష్ట్రలోని అమరావతిని ఇంద్రపురిగా పిలుస్తారని.. ఏపీలోని అమరావతి సైతం ఇంద్రుడు తిరిగిన నేలగా ప్రసిద్ధి చెందిందని పేర్కొన్నారు. సీజేఐగా తన చివరి కార్యక్రమం కూడా అమరావతిలో జరుగుతోందని వివరించారు. భారత పౌరుల ప్రాథమిక హక్కులకు భంగం కలగకుండా రాజ్యాంగం రక్షణ కల్పించిందన్నారు సీజేఐ.

## సీఐఐ సమ్మిట్-2025 చరిత్ర సృష్టించింది: మంత్రి అనగాని..



అమరావతి,(సందేశం టైమ్స్): ఆంధ్రప్రదేశ్ పెట్టుబడుల దిశను మార్చిన చారిత్రాత్మక వేదిక విశాఖ సీఐఐ సమ్మిట్–2025 అని మంత్రి అనగాని సత్యప్రసాద్ చెప్పారు. ఏపీని పెట్టుబడుల హబ్‌గా మార్చేందుకు సీఎం చంద్రబాబు నాయుడు , మంత్రి నారా లోకేశ్ పెద్దఎత్తున శ్రమిస్తున్నారని ప్రశంసించారు. విశాఖ వేదికగా ఈనెల 14, 15వ తేదీల్లో సీసీఐ భాగస్వామ్య సదస్సు–2025 జరిగిన సంగతి తెలిసిందే. ఈ సదస్సు ద్వారా రాష్ట్రానికి లక్షల కోట్ల పెట్టుబడులు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు రానున్నట్లు కూటమి ప్రభుత్వం ప్రకటించింది. ఇందుకు కష్టపడిన సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌పై ప్రశంసలు కురుస్తున్నాయి. కాగా, సమ్మిట్ విజయవంతం కావడంపై తాజాగా మంత్రి అనగాని స్పందించారు. ఈ సందర్భంగా మంత్రి అనగాని మాట్లాడుతూ.. 'ఏపీని పెట్టుబడుల హబ్‌గా మార్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ శ్రమిస్తున్నారు. పెట్టుబడులను ఏపీకి తేవడంలో చంద్రబాబు మరోసారి తన సత్తా చాటారు. మూడు ప్రాంతాలకూ సమానంగా పెట్టుబడులు వచ్చేలా మంత్రి లోకేశ్ ప్రత్యేకంగా కంపెనీలను గైడ్ చేశారు. మిగిలిన రాష్ట్రాలకు భిన్నంగా స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను అనుసరిస్తుండడంతో ఏపీకి పరిశ్రమలు క్యూ కట్టాయి.

## హిందూపురం అభివృద్ధికి శక్తి వంచన లేకుండా పనిచేస్తా: నందమూరి బాలకృష్ణ



శ్రీ సత్యసాయి జిల్లా, నవంబరు16 (సందేశం టైమ్స్): హిందూపురం అభివృద్ధికి శక్తి వంచన లేకుండా పనిచేస్తానని తెలుగుదేశం పార్టీ హిందూపురం ఎమ్మెల్యే, ప్రముఖ నటుడు నందమూరి బాలకృష్ణ వ్యాఖ్యానించారు. ఇవాళ(ఆదివారం) హిందూపురం మున్సిపల్ పరిధిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు బాలకృష్ణ. ఈ సందర్భంగా ఆయన ప్రసంగించారు.తనను మూడుసార్లు గెలిపించిన హిందూపురం ప్రజలకు రుణపడి ఉంటానని బాలకృష్ణ తెలిపారు. హిందూపురం ప్రాంతంలో కొత్త పరిశ్రమలు తీసుకువచ్చి నిరుద్యోగ యువతీయువకులను ఆదుకుంటానని భరోసా కల్పించారు. ఏపీ మంత్రులంతా హిందూపురం అభివృద్ధిపై దృష్టి పెట్టారని పేర్కొన్నారు.కాగా, హిందూపురంలో ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ రెండోరోజు పర్యటించారు. హిందూపురం మండలం మలుగూరులో రూ. 26.5 లక్షల వ్యయంతో నిర్మించిన పశువుల ఆస్పత్రి భవనాన్ని ప్రారంభించారు. అలాగే, వాల్మీకి దేవాలయాన్ని సందర్శించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అధికారులు బాలకృష్ణకి ఘనంగా స్వాగతం పలికి.. తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం బాలకృష్ణ వేదపండితుల ఆశీర్వచనం పొందారు.

## అయ్యప్ప భక్తులకు ముఖ్య సూచన



ఇంటర్నెట్ డెస్క్:(సందేశం టైమ్స్): స్వామియే శరణం అయ్యప్ప.. కార్తీక మాసం మొదలు.. మకర సంక్రాంతి వరకు ఎక్కువగా వినిపించే శరణు ఘోష. దేశ వ్యాప్తంగా లక్షలాది మంది అయ్యప్ప స్వామి భక్తులు మాల ధారణ చేసి.. 41 రోజులు పాటు నియమనిష్టలతో స్వామివారిని పూజిస్తారు. ప్రతి ఏటా మండలపూజా మహోత్సవం, మకరవిళక్కు సమయంలో అయ్యప్ప భక్తులు మాలధారణ చేసి కేరళలోని శబరిగిరీశుడిని దర్శించుకుంటారు. మండలపూజా మహోత్సవంలో భాగంగా నవంబర్ 16వ తేదీ నుంచి శబరిమలలోని అయ్యప్పస్వామి గుడి తలుపులు తెరుచుకున్నాయి. ఈ రోజు నుంచి అయ్యప్ప స్వామి తన భక్తులకు దర్శనం ఇవ్వనున్నాడు. ఇక ఇప్పటికే అయ్యప్ప మాల వేసిన లక్షలాది మంది భక్తులు.. అయ్యప్పను దర్శించుకునేందుకు శబరిమలకు వెళ్తున్నారు. ఈసారి శబరిమలకు భక్తుల తాకిడి అధికంగా ఉండే అవకాశం ఉండటంతో.. కేరళ వైద్యారోగ్య శాఖ కీలక ప్రకటన జారీ చేసింది. శబరిగిరీశుడిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు పలు సూచనలు చేసింది. 'బ్రెయిన్ ఫీవర్' పట్ల భక్తులు అప్రమత్తంగా ఉండాలని కోరింది. కేరళలో ఇటీవల ప్రమాదకరమైన ప్రైమరీ అమీబిక్ మెనింజో ఎన్సెఫలైటిస్ వ్యాధి – దీనిని 'బ్రెయిన్ ఈటింగ్ అమీబా' ఫీవర్ అని.. మెదడు వాపు వ్యాధి అని పిలుస్తుంటారు. దీని బారిన పడకుండా పలు ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది.




## సీఐఐ సదస్సు సూపర్ హిట్..
### కూటమి ప్రభుత్వంపై మన్నవ మోహనకృష్ణ ప్రశంసలు..

(సందేశం టైమ్స్): విశాఖపట్నంలో నిర్వహించిన రెండు రోజుల ప్రతిష్టాత్మక సీఐఐ భాగస్వామ్య సదస్సులో ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మన్నవ మోహనకృష్ణ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే అభివృద్ధికి నాంది పలుకుతూ పెట్టుబడిదారులను ఆహ్వానించారని అన్నారు. విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ చేస్తున్న కృషి అత్యంత ప్రశంసనీయమని పేర్కొన్నారు.అనేక దిగ్గజ కంపెనీలు పెట్టుబడులు పెట్టడానికి ముందుకు రావడంతో ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు మరో దశలోకి అడుగుపెడుతోందని మన్నవ మోహనకృష్ణ సంతోషం వ్యక్తం చేశారు. విశాఖ వేదికగా రెండురోజులు పాటు సాగిన 30వ సీఐఐ భాగస్వామ్య సదస్సు సూపర్ హిట్ అయిందని, రెండు రోజుల్లో రూ. 13 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించడం గొప్ప రికార్డని అన్నారు.

## సీఐఐ సదస్సు సూపర్ హిట్..
### కూటమి ప్రభుత్వంపై మన్నవ మోహనకృష్ణ ప్రశంసలు..

విజయవాడ, నవంబరు16(సందేశం టైమ్స్): ఏపీ రాజకీయాల్లో మరో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. రాజకీయాల్లో వంగవీటి రంగా కుమార్తె ఆశా కిరణ్ రాజకీయాల్లో అరంగ్రేటం చేయనున్నారు. ఈ మేరకు ప్రజలతో తాను మమేకం అవుతానని.. ఇక నుంచి పాలిటిక్స్‌లో యాక్టివ్ అవుతానని వ్యాఖ్యానించారు. ఇవాళ(ఆదివారం) వంగవీటి రంగా విగ్రహానికి నివాళులు అర్పించి త్వరలోనే రాజకీయాల్లోకి వస్తున్నట్లు ప్రకటించారు ఆశ కిరణ్. ఈ సందర్భంగా ఆశా కిరణ్ మీడియాతో మాట్లాడారు. రాధా, రంగా మిత్రమండలి ఆహ్వానం మేరకు పలు కార్యక్రమాల్లో పాల్గొంటానని పేర్కొన్నారు.రంగా ఆశయ సాధన కోసం తాను కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజల జీవితానికి కొంతకాలంగా తాను దూరంగా ఉన్నానని.. ఇకపై పూర్తిగా తన జర్నీ ప్రజలతోనే ఉంటుందని స్పష్టం చేశారు.

## ఏపీ పాలసీలు అద్భుతం...

## సీఎం చంద్రబాబును ప్రశంసించిన రేమాండ్స్ గ్రూప్

ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక ప్రగతి పథంలో మరో కీలక ముందడుగు పడింది. రాష్ట్రానికి పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా జరుగుతున్న 30వ సీఐఐ భాగస్వామ్య సదస్సు వేదికగా ముఖ్యమంత్రి చంద్రబాబు పలు కీలక ప్రకటనలు చేశారు. రాష్ట్రంలో ప్రముఖ పారిశ్రామిక టౌన్‌షిప్‌గా ఉన్న శ్రీసిటీకి అదనంగా 6 వేల ఎకరాల భూమిని కేటాయించనున్నట్టు వెల్లడించారు. శ్రీసిటీని రాష్ట్ర అభివృద్ధికి ఒక రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతామని ఆయన స్పష్టం చేశారు. సదస్సు రెండో రోజైన శనివారం సీఎం చంద్రబాబు పలు కార్యక్రమాల్లో పాల్గొని, రాష్ట్ర పారిశ్రామిక ప్రగతిపై తన దార్శనికతను ఆవిష్కరించారు. సీఐఐ సదస్సు నుంచే ముఖ్యమంత్రి చంద్రబాబు, రేమాండ్స్ గ్రూప్‌కు చెందిన 3 ప్రాజెక్టులకు వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. అదేవిధంగా, శ్రీసిటీలో ఇప్పటికే కార్యకలాపాలు ప్రారంభించిన 5 కంపెనీలను లాంఛనంగా ప్రారంభించారు. శ్రీసిటీలో కొత్తగా పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చిన పలు సంస్థలతో రాష్ట్ర ప్రభుత్వం తరఫున అవగాహన ఒప్పందాలు (ఎంఓయూలు) కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, "భారతదేశంలోనే అత్యుత్తమ పారిశ్రామిక టౌన్‌షిప్ శ్రీసిటీ. డైకెన్, ఇసుజు, క్యాడ్బరీ వంటి ప్రపంచ ప్రఖ్యాత సంస్థలు ఇక్కడి నుంచే తమ ఉత్పత్తులను ప్రపంచానికి అందిస్తున్నాయి. మరిన్ని అంతర్జాతీయ కంపెనీలు శ్రీసిటీకి రావాలి. ఇప్పటికే బెల్జియం, జపాన్, యూకే, జర్మనీ, ఆస్ట్రేలియా వంటి దేశాలకు చెందిన హెల్త్‌కేర్, ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్, మెడికల్ పరికరాల కంపెనీల నుంచి రూ. 8.87 లక్షల కోట్ల పెట్టుబడులకు అనుమతులు ఇచ్చాం" అని తెలిపారు. గత రెండు రోజులుగా జరిగిన సదస్సులో రూ. 13 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయని, మొత్తంగా తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 18 నెలల్లోనే రూ. 22 లక్షల కోట్ల పెట్టుబడులను సాధించామని చంద్రబాబు వివరించారు.

"త్వరలోనే శ్రీసిటీకి మరో 6 వేల ఎకరాల భూమిని అందుబాటులోకి తెస్తాం. రాబోయే రోజుల్లో 50కి పైగా దేశాలకు చెందిన కంపెనీలు శ్రీసిటీ నుంచి పనిచేస్తాయి. తద్వారా 1.50 లక్షల మందికి ఉద్యోగాలు లభించి, శ్రీసిటీ ఒక అభివృద్ధి మోడల్‌గా మారుతుంది. దీని సమీపంలోనే ఒక ఎయిర్‌స్ట్రిప్ నిర్మించే ఆలోచన కూడా ఉంది. ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం శ్రీసిటీ తరహా మోడల్స్ రాష్ట్రంలో మరిన్ని రావాలి. దేశంలోనే తొలిసారిగా పారిశ్రామిక ప్రోత్సాహకాల కోసం ఏపీ ప్రభుత్వం ఎస్క్రో ఖాతాను ఏర్పాటు చేస్తోంది. 2028 నాటికి శ్రీసిటీని దేశంలోనే అత్యుత్తమ పారిశ్రామిక ప్రాజెక్టుగా మారుస్తాం" అని ముఖ్యమంత్రి ధీమా వ్యక్తం చేశారు.

## విశాఖలో గోమాంసం నిల్వ..

## పవన్ సీరియస్


విశాఖ నగరంలో భారీ ఎత్తున అక్రమ గోమాంసం నిల్వలు బయటపడిన ఘటనపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్రంగా స్పందించారు. ఈ దందా వెనుక ఉన్న ముఠాల మూలాలను తక్షణమే వెలికితీయాలని విశాఖ పోలీసులను ఆయన ఆదేశించారు. ఈ వ్యవహారంలో ఎవరి ప్రమేయం ఉ న్నా ఉపేక్షించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఘటన వెలుగులోకి రాగానే ఆయన నేరుగా విశాఖ పోలీస్ కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడి కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా డీఆర్ఐ అధికారులు మిత్రా కోల్డ్ స్టోరేజీలో జరిపిన దాడుల్లో 1.89 లక్షల కిలోల గోమాంసాన్ని స్వాధీనం చేసుకుని, కేసును పోలీసులకు అప్పగించినట్లు కమిషనర్ పవన్ కల్యాణ్‌కు వివరించారు. కోల్డ్ స్టోరేజ్ నిర్వాహకులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని తెలిపారు. ఈ మాంసాన్ని ఎక్కడి నుంచి సేకరించారు, ఎక్కడికి తరలించాలని చూశారు, అనుమతుల్లో ఎలాంటి ఉల్లంఘనలు జరిగాయనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోందని కమిషనర్ పేర్కొన్నారు. దోషులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.

అక్రమ గోవధ, గోమాంసం విక్రయాలు, ఎగుమతులను ఏ రూపంలోనూ సహించేది లేదని పవన్ తేల్చిచెప్పారు. ఎన్డీయే ప్రభుత్వం గోవధ నిషేధంపై ఎంత పటిష్టంగా పనిచేస్తుందో ఈ ఘటనే నిదర్శనమని అన్నారు. గతంలో తన దృష్టికి రాగానే పిఠాపురంలోని జంతు వధశాలను మూసివేయించిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు.

---

## జనవరి 10 వరకు తుంగభద్ర నీరు..



బళ్లారి(సందేశం టైమ్స్): తుంగభద్ర జలాశయం నుంచి పంట కాలువలకు జనవరి 10వ తేదీ వరకు నీరు వదిలేలా ఐసీసీ సమావేశంలో నిర్ణయించారు. పంట కోతలు పూర్తయ్యే వరకు వదలాలని తీర్మానించారు. శనివారం బెంగళూరులోని నీటిపారుదల శాఖ భవనంలో జలవనరుల శాఖ, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, ఐసీసీ కమిటీ చైర్మన్ మంత్రి శివరాజ్ తంగడిగే అధ్యక్షతన సమావేశం నిర్వహించారుతుంగభద్ర బోర్డులోని కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ఇంజనీర్లు, బోర్డు చైర్మన్‌తో పాటు బళ్లారి, సిరుగుప్ప, కంప్లి, కొప్పళ, విజయనగర, రాయచూరు ఎమ్మెల్యేలు, మంత్రులు నాగేంద్ర, గణేష్, బోసురాజు, రాఘవేంద్ర హిత్నాల్, రైతు సంఘం నాయకులు హాజరయ్యారు. తుంగభద్ర జలాశయంలో శుక్రవారానికి 75.989 టీఎంసీల నీరు నిల్వ ఉందనీ, ప్రసుత్తం డ్యాం ఆయకట్టులో పంటను కాపాడేందుకు నీటిని విని యోగించేలా తీర్మానించారు.

## గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన

లేపాక్షి (సందేశం టైమ్స్): గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని విద్యార్థులకు తెలియజేశారు. గ్రంథాలయవారోత్సవాల్లో భాగంగా 2వరోజు శనివారం లేపాక్షి శాఖా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. 20 మంది విద్యార్థులు గ్రంథాలయంలో వివిధ రకాల పుస్తకాలను తిలకించి పుస్తక పఠనం చేశారు. విద్యార్థులు ఫోన్ లకు టీవీలకు దూరంగా ఉంటూ గ్రంథాలయాలకు దగ్గరగా ఉండాలని గ్రంథాలయ నిర్వాహకులు తెలిపారు. ప్రతిరోజు విద్యార్థులు గ్రంథాలయాలకు వచ్చి విజ్ఞానాన్ని పెంచుకొని మంచి విద్యార్థులుగా ఎదగాలని కోరారు.

## ఎన్సిసి క్యాడెట్లను అభినందించిన జిల్లా కలెక్టర్




నరసరావుపేట, (సందేశం టైమ్స్): ఆంధ్రప్రదేశ్, తెలంగాణ డైరెక్టరేట్ తరుపున ఆల్ ఇండియా థాల్ సైనిక్ క్యాంప్ (ఏఐటీఎస్సి) – 2025 లో ప్రతిభ కనబరిచిన నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన ఎన్సిసి క్యాడెట్లను జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల ఘనంగా సత్కరించి, మెమెంటోలు అందజేసి అభినందించారు. ఏఐటీఎస్సి భారతదేశ ఎన్సీసీ నిర్వహించే అత్యంత ప్రతిష్టాత్మక జాతీయ స్థాయి సైనిక శిక్షణ క్యాంపుల్లో ఒకటని, యువతలో క్రమశిక్షణ, ధైర్యం, నాయకత్వం, జాతీయ సేవాభావాన్ని పెంపొందించడం ఈ క్యాంప్ ప్రధాన లక్ష్యం. పల్నాడు జిల్లా నుండి కేవలం ఇద్దరు క్యాడెట్లు మాత్రమే ఏఐటీఎస్సి కు ఎంపికయ్యారని, ఇద్దరూ నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన సిహెచ్. మణి కుమార్, పి. లిఖిత నందినిలు ఎంపికవ్వడం తమ కళాశాల గౌరవాన్ని మరింత పెంచిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా, కళాశాల ఎన్సీసీ అధికారి లెఫ్టినెంట్ మేడికొండ రాజేష్ బాబు ను మరియు 23వ ఆంధ్రప్రదేశ్ బెటాలియన్ వారిని ప్రత్యేకంగా అభినందించారు.

## నరసరావుపేటలో స్వచ్ఛాంధ్ర ర్యాలీ




నరసరావుపేట , (సందేశం టైమ్స్): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాలు నిరంతరంగా జరుగుతున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు అన్నారు. శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతి మూడవ శనివారం నిర్వహించిన పర్సనల్ అండ్ కమ్యూనిటీ హైజీన్ అవగాహన ర్యాలీ స్థానిక మున్సిపాలిటీ కార్యాలయం నుంచి పల్నాడు రోడ్డులోని అన్నా క్యాంటీన్ వరకు నిర్వహించిన ర్యాలీలో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ర్యాలీ అనంతరం స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో నాయకత్వంలో స్వచ్ఛభారత్ మిషన్‌ను స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్రగా విస్తరించి, ప్రతి గ్రామం, ప్రతి పట్టణం స్వచ్ఛంగా తీర్చిదిద్దే దిశగా అడుగులు వేస్తున్నామని తెలిపారు. ఇది కేవలం శుభ్రతా కార్యక్రమం మాత్రమే కాదని ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ, సమాజ బాధ్యతలను పెంపొందించే మహా ఉద్యమమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఏం. జస్వంత్ రావు, అధికారులు, కూటమి నాయకులు, విద్యార్థులు, మహిళా సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాలపై సమీక్ష జరిపిన జిల్లా కలెక్టర్




నరసరావుపేట, (సందేశం టైమ్స్): –రోడ్డు ప్రమాదాల నియంత్రణ కోసం అన్ని శాఖల అధికార సిబ్బంది సమన్వయంతో పని చేసి వచ్చే సంవత్సరం మార్చి నాటికి పల్నాడు జిల్లాలో పూర్తిగా తగ్గించాలని జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా అన్నారు. శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో రహదారి భద్రత కమిటీ సమన్వయ సమావేశం జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ బి. కృష్ణారావు మరియు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ విభాగాలతో జిల్లాలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై సమీక్ష జరిపి నివారణకు అన్ని చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో రహదారులు, భవనాల శాఖ అధికారి గీతా రాణి మొట్ట మొదట పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ కొరకు తీసుకోవలసిన అంశాలను గురించి వివరించారు. అనంతరం పల్నాడు జిల్లా ఎస్పి కృష్ణారావు రోడ్డు ప్రమాదాల డేటాను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ లో చూపించారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదాల నివారణ కొరకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అలాగే జాతీయ భద్రత రహదారి ఉత్సవాలపై గోడపత్రికల ను జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా, జిల్లా ఎస్పీ కృష్ణారావు ఆవిష్కరించారు. ఎన్జీవో తరపున పల్నాడు జిల్లా రహదారి భద్రత కమిటీ సభ్యులు ఆర్. కనకదుర్గ పద్మజ రోడ్డు ప్రమాదాల నివారణ కొరకు డ్రైవింగ్ శిక్షణ అవసరమని ముఖ్యంగా జిల్లాలో నిరుద్యోగ యువతకు డ్రైవింగ్ శిక్షణ ఇచ్చి రోడ్డు ప్రమాదాల రహిత డ్రైవర్ల ను తయారు చేయాలని కోరారు. పల్నాడు జిల్లాలో రోడ్డు సేఫ్టీ ఎన్జీవో సారధ్యంలో నిర్వహిస్తున్న ట్రాన్స్ పోర్ట్ వాహనాల డ్రైవింగ్ శిక్షణ తీసుకునే వారికి ఖాకీ డ్రెస్సు జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా చేతుల మీదుగా అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ మధులత, ఆర్టీసీ ఆర్.ఎం.రజిత కుమారి, ఆర్టీవో మధులత, డీ.ఎం.హెచ్.వో డాక్టర్ రవి, నరసరావుపేట మున్సిపల్ శాఖ అధికారి జస్వంత్ రావు, స్టేట్ హైవే అధికారులు, స్టేట్ ప్రొటెక్షన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ధర్తీ ఆబా భగవాన్ బిర్సా ముండా 150వ జయంతి

## జన్ జాతీయ గౌరవ దినోత్సవ వేడుకలు

### ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ చదలవాడ అరవింద బాబు



నరసరావుపేట,(సందేశం టైమ్స్): న1రసరావుపేట మండలం పెద్ద తురకపాలెం గ్రామంలో ఆంధ్రప్రదేశ్ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌లో ధర్తీ ఆబా భగవాన్ బిర్సా ముండా 150వ జయంతి జన్ జాతీయ గౌరవ దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు, పల్నాడు జిల్లా కలెక్టర్ కృత్తిక శుక్లా లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. రెసిడెన్షియల్ స్కూలు పరిశీలించారు. పిల్లలకి చేతులు కడుక్కోవడం, శుభ్రంగా ఎలా ఉండాలో నేర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ధర్తీ ఆబా భగవాన్ బిర్సా ముండా 1875 జూన్ 15న ఝార?ండ్‌లోని ఉలిహతు గ్రామంలో జన్మించారు. బ్రిటిష్ వలసవాదులకు వ్యతిరేకంగా 'ఉల్‌గులాన్' (మహా తిరుగుబాటు) నడిపించి, గిరిజన హక్కుల కోసం పోరాడిన మహానాయకుడు. కేవలం 25 ఏళ్ల వయసులోనే 1900 జూన్ 9న రాంచీ జైలులో అమరుడయ్యారు. ఆయన 'అబువా రాజ్ ఏటె జోహార్' (అడవుల రాజ్యాన్ని తిరిగి ఇవ్వండి) అనే నినాదంతో భూమి, అడవులు, గిరిజనుల ఆత్మగౌరవం కోసం జీవితాన్ని అర్పించారు. ఈ రోజు మనం ఆయన 150వ జయంతిని జ్ఞాపకం చేసుకుంటూ, స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ చేస్తున్నాం. ప్రతి ఒక్కరూ చెట్లు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి" అని పిలుపునిచ్చారు.

అదే రోజు స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పెద్ద తురకపాలెం గ్రామంలోని గిరిజన బాలికల పాఠశాలలో వ్యక్తిగత, సామాజిక పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా తో కలిసి విద్యార్థినులతో చేతులు కడిగి, పరిశుభ్రత యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ఇలాంటి కార్యక్రమాలు ద్వారా గ్రామాల్లో ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మిస్తాం అని డాక్టర్ అరవింద బాబు అన్నారు.

# సంగారెడ్డి జిల్లాలో కల్లుగీత కార్మిక సంఘం
## 3వ మహాసభల ఏర్పాట్లు ప్రారంభం



(సందేశం టైమ్స్) సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 15నవంబర్ సంగారెడ్డి పట్టణంలోని అంబేద్కర్ భవన్‌లో నవంబర్ 16న జరగనున్న కల్లుగీత కార్మిక సంఘం (KGKS) సంగారెడ్డి జిల్లా మూడో మహాసభలకు సంబంధించిన ఏర్పాట్లను సంఘం నాయకులు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు ఆశన్న గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రమేశ్ గౌడ్ మాట్లాడుతూ మహాసభలను అంబేద్కర్ భవన్‌లో ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు తెలిపారు ఈ మహాసభలకు రాష్ట్ర అధ్యక్షులు MV రమణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకట నరసయ్య, గౌడ సమాజ ప్రజాప్రతినిధులు, మేధావులు, అధికారులు హాజరుకానున్నారని వారు పేర్కొన్నారు. మహాసభల రోజు ఉదయం 10:30 గంటలకు సంగారెడ్డి లోని సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహం వద్ద నుంచి భారీ బైక్ ర్యాలీ ప్రారంభం కానుందని నాయకులు తెలిపారు. జిల్లాలోని గౌడ సోదరులు, కల్లుగీత కార్మికులు, సొసైటీ అధ్యక్షులు, టిఫ్టీ సభ్యులు అందరూ భారీ ఎత్తున పాల్గొని మహాసభలను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జంగన్న గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు అంజ గౌడ్, జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాస్ గౌడ్, కృష్ణ గౌడ్, హరీష్ గౌడ్ తదితరులుపాల్గొన్నారు.

# కోర్మనీ మొగులయ్యకు సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ చేసిన
## మాజీ ఉపసర్పంచ్

సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి నవంబర్ 15 సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండలం మర్వేల్లి గ్రామానికి చెందిన కోర్మనీ మొగులయ్యకు రూ.60,000 సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరైంది. పీసీసీ వైస్ ప్రెసిడెంట్ పట్లోల సంగమేశ్వర్ ఆదేశాల మేరకు, ఈరోజు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును మాజీ ఉప సర్పంచ్ బస్వరాజ్ మొగులయ్యకు అందజేశారు. ఈ కార్యక్రమంలో చిన్న గొల్ల నరసింహులు పాల్గొన్నారు. చెక్కు మంజూరుతో తనకు లభించిన ప్రభుత్వ సహాయంపై మొగులయ్య కృతజ్ఞతలుతెలిపారు.



# లక్ష్మీ నరసింహా స్వామి ఆలయం వార్షికోత్సవ వేడుకలకు
## మంత్రిగారికి ఆహ్వానం...



(సందేశం టైమ్స్) సంగారెడ్డి టౌన్ ప్రతినిధి (నవంబర్ 15) రాష్ట వైద్య ఆరోగ్య అండ్ సైన్స్ టెక్నాలజీ శాఖ మంత్రి వర్యులు దామోదర్ రాజనర్సింహ గారి నీఅల్లాదుర్గ్ లోని 18-11-2025,రోజు నా జరిగే శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకలకు ఆహ్వానించిన అల్లాదుర్గం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొప్పుల శేషారెడ్డి మరియు, సినియర్ నాయకులు సుభాష్ రావు ,ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు బలరాం ,మండల ప్రధాన కార్యదర్శి బాలకిషన్ ,శ్రీనివాస్ రెడ్డి ,శ్రీశైలం సాయిలు ,తుకారాం , వెంకటేష్, శీను , సంగారెడ్డి లోని మంత్రివర్యులు దామోదర్ రాజనర్సింహ గారికి సాధారణంగా ఆహ్వానించారు

# పాండురంగ స్వామిని దర్శించిన
## మంత్రివర్యులు



(సందేశం టైమ్స్) సంగారెడ్డి నియోజకవర్గ ఇన్చార్జి నవంబర్ 15 సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం అంతారం గ్రామం లోని శ్రీ జీవన్ ముక్త మహారాజ్ గారి ఉత్సవాల సందర్భంగా ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం శ్రీ పాండురంగ స్వామి దేవాలయం లో రాష్ట్ర వైద్య , ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమం లో పీఠాధిపతి శ్రీ జ్ఞానేశ్వర్ (బాలరాజు) మహారాజ్ , జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ అంజయ్య , మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్ రెడ్డి , మాజీ ఎంపీపీ రాంరెడ్డి , అంతారం నర్సింహా గౌడ్ , సతీష్ , కంబంపల్లి సంగమేశ్వర్ , పాండు , మహిపాల్ రెడ్డి , మాజీ ప్రజాప్రతినిధులు, ఇతర నాయకులు , యువజన నాయకులుపాల్గొన్నారు.

# కన్నుల పండుగగా 'శబరిగిరీశుని' పడిపూజ:
## భక్తిశ్రద్ధలతో పాల్గొన్న వాయిల సింగారం భక్తులు





(సందేశం టైమ్స్)అనంతగిరి (సూర్యాపేట జిల్లా): సూర్యాపేట జిల్లా, అనంతగిరి మండలం, వాయిల సింగారం గ్రామంలో గత రాత్రి అయ్యప్ప స్వామి పడిపూజ కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధల నడుమ కన్నుల పండుగగా జరిగింది. కొండపల్లి వాసు గురుస్వామి మరియు మేళ్లచెరువు వెంకటయ్య గురుస్వామి పర్యవేక్షణలో ఈ అయ్యప్ప స్వామి పడిపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

### ఆధ్యాత్మికతకు నిలువుటద్దం పడిపూజ

ఈ సందర్భంగా వెంకటయ్య గురుస్వామి మాట్లాడుతూ... గ్రామ ప్రజల సాయ సహకారాలతో ప్రతి సంవత్సరం వాయిల సింగారంలో అయ్యప్ప భక్తులు మాలలు ధరించి, భక్తి శ్రద్ధలతో ఈ పూజ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. అయ్యప్ప స్వామి దీవెనలతో గ్రామ ప్రజలందరూ పాడిపంటలతో పుష్కలంగా పండి, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ ఈ పడిపూజ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని వివరించారు.

### గురుస్వామి వివరణ ప్రకారం:

పడిపూజ అంటే స్వామి పాదాలను భక్తితో పూజించడం. ఇది భక్తుని లోపలి
ఆధ్యాత్మిక చింతనను మరింత లక్ష్యంగా చేసుకునేందుకు చేసే ముఖ్యమైన ఆచారం.
ఇది అయ్యప్ప దీక్షలో అతి ముఖ్యమైన ఘట్టం. దీనిని కుటుంబ సభ్యులు, భక్తులు ఎంతో భక్తితో నిర్వహిస్తారు.
పడిపూజ ద్వారా భక్తుడు తన ఆత్మను శుద్ధి చేసుకుని ఆధ్యాత్మిక శాంతిని పొందుతాడు.
'స్వామి శరణం' మంత్రాన్ని 108 సార్లు జపించడం ద్వారా ఎక్కువ శక్తి, పుణ్యం లభిస్తాయని చెప్పారు.
ఇరుముడి కట్టిన అయ్యప్ప భక్తులు 41 రోజులు దీక్షను నిబద్ధతతో పాటించాలని శాస్త్రం చెబుతోంది.
శబరిమల ఆలయంలోని 18 మెట్లు ప్రతిదానికి
ఒక ప్రత్యేకమైన అర్థం ఉంటుంది. అవి మనలోని చెడు గుణాలు, పాపాలను తొలగించి
భక్త జీవితాన్ని పవిత్రం చేస్తాయనిఆయనతెలిపారు.

# జాతీయ లోక్ అదాలత్ లో 33 కేసులు పరిష్కారం..
## కోర్టు జడ్జి మంథని శ్రీధర్



(సందేశం టైమ్స్) సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 15నవంబర్ సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గంలో నారాయణఖేడ్ పట్టణంలోని మున్సిపల్ మెజిస్ట్రేట్ కోర్టులో శనివారం ఖేఢ్ జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి మంథని శ్రీధర్ సమక్షంలో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఖేఢ్ జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి మంథని శ్రీధర్ మాట్లాడుతూ.....33 కేసులు రాజీ మార్గం ద్వారా పరిష్కారం చేయడం జరిగిందని కోర్టు జడ్జి మంథని శ్రీధర్ తెలిపారు. కక్షిదారులు రాజీమార్గంతో కేసులు పరిష్కారం చేసుకోవాలని సదుద్దేశంతో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తుండడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు భోజిరెడ్డి న్యాయవాదులు మారుతి రెడ్డి లక్ష్మణ్ రావు నర్సింగ్ రావు చంద్రశేఖర రావు పలువురు న్యాయవాదులు కంగ్టి సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకట్ రెడ్డి,మానూర్ ఎస్ఐ కోటేశ్వరరావు, నారాయణఖేడ్ ఎస్ఐ శ్రీశైలం,నాగల్ గిద్ది ఎస్ఐ రామకృష్ణ,కోర్టు సిబ్బంది తదితరులుపాల్గొన్నారు.

# దళిత ఆత్మగౌరవ ప్రదర్శన ఏర్పాట్లు పరిశీలన:
## పోలీసుల సహకారాన్ని కోరిన మంద కృష్ణ మాదిగ




(సందేశం టైమ్స్) జాతీయ తిరున పత్రిక న్యూఢిల్లీ, జంతర్ మంతర్ నవంబర్ 17న న్యూ ఢిల్లీలోని జంతర్ మంతర్ ధర్నా చౌక్లో జరగనున్న దళితుల 'ఆత్మగౌరవ ప్రదర్శన' ఏర్పాట్లను MRPS వ్యవస్థాపక అధ్యక్షులు, పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ గారు ఇవాళ పరిశీలిం చారు. కార్యక్రమం వేదిక ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం, ప్రదర్శన కు సంబంధించిన టెంట్ హౌస్ మరియు సౌండ్ సిస్టం వర్కర్స్కు ఏర్పాట్లపై ఆయన పలు కీలక సూచనలు చేశారు. కార్యక్రమం ప్రశాంతంగా మరియు విజయవంతంగా జరిగేందుకు MRPS నాయకులు మరియు కార్యకర్తలు పూర్తి సహకారాన్ని అందిస్తారని ప్రకటించారు. అదేవిధంగా, కార్యక్రమానికి పోలీసుల సహకారం అందించాలని ఆయన కోరారు. ఈ మేరకు పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ అధికారి మనోజ్ భాటియా గారికి, ధర్నా చౌక్ ఇంచార్జి పోలీస్ అధికారి జితేంద్ర గారికి ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. దళిత ఆత్మగౌరవ ప్రదర్శన విజయవంతం కోసం ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నట్లుతెలుస్తోంది.

# కోదాడ లో ముదిరాజ్ కార్తీక వనభోజన కార్యక్రమము



(సందేశం టైమ్స్) సూర్యాపేట జిల్లా కోదాడ లో16.11.2025 ఆదివారం నాడు పురురా వంశ క్షత్రియ పాండు కుల వన భోజన మహోత్సవ కార్యక్రమం కోదాడ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనభోజన కార్యక్రమాన్ని ప్రతి సంవత్సరం నిర్వహించడం ఆనవాయితీ కార్తీక మాసం సందర్భంగా కోదాడ లో రామిరెడ్డి పాలెం దగ్గర మామిడి తోటలో కార్తీక వనభోజన కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతున్నది ఇట్టి కార్యక్రమంలో కోదాడ నియోజకవర్గ ముదిరాజ్ సంఘం నాయకులు అందరూ కూడా పాల్గొని వనభోజన కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా కోదాడ ముదిరాజ్ సంఘం నుండి కోరుచున్నాం ఇట్టి కార్యక్రమానికి ముదిరాజు బంధువులు అందరూ కూడాఆహ్వానితులే

# 9999 నంబర్‌కు రూ.22.72 లక్షలు




హైదరాబాద్ సిటీ: (సందేశం టైమ్స్): ఫ్యాన్సీ నంబర్ల ఆన్‌లైన్ వేలంలో రవాణా శాఖకు రూ.65.38 లక్షల ఆదాయం సమకూరింది. ఖైరతాబాద్ ఆర్‌టీఏ కార్యాలయంలో నిర్వహించిన వేలంలో టీజీ 09 హెచ్ 9999 నంబర్‌ను రికార్డు స్థాయిలో రూ.22,72,222లకు హానర్ ప్రైమ్ హౌసింగ్ ఎల్ఎల్‌పీ సంస్థ దక్కించుకుంది. టీజీ 09 జే 0009 నెంబర్‌ను దండు ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ రూ.6.80 లక్షలకు, టీజీ 09 జే 0006 నెంబర్‌ను సాయి సిల్క్స్ కళామందిర్ లిమిటెడ్ రూ.5.70 లక్షలకు దక్కించుకున్నాయి.%టీజీ 09 జే 0099 నంబర్‌ను గోదావరి ఫార్చ్యూన్ రూ.3.40 లక్షలకు, టీజీ 09, జే 0001ను శ్రీనిధి ఐటీ స్పేసెస్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.2.60 లక్షలకు, టీజీ 09 జే 0005 నెంబర్‌ను నిహారిక ఎంటర్‌టైన్‌మెంట్ రూ.2.40 లక్షలకు వేలంలో దక్కించుకున్నాయి. మరి కొన్ని నెంబర్లనూ రూ.1.15 లక్షల నుంచి రూ.1.71 లక్షలకు పలు సంస్థలు కొనుగోలు చేశాయి.

# ఐ-బొమ్మ నిర్వాహకుడు అరెస్ట్




(సందేశం టైమ్స్): ఐ-బొమ్మనిర్వాహకుడు ఇమ్మడి రవి అరెస్టయ్యాడు. హైదరాబాద్ లోని కూకట్ పల్లిలో సీసీఎస్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఫ్రాన్స్ నుంచి హైదరాబాద్ ఇమ్మడి రవి వచ్చారు. ఈ క్రమంలో పక్కా సమాచారం అందుకున్న సీసీఎస్ పోలీసులు అతడిని అరెస్ట్ చేశారు. రవి కరేబియన్ దీవుల్లో ఉంటూ ఐ బొమ్మ వెబ్ సైట్ ను నిర్వహించేవాడు. ఈ వెబ్ సైట్ నిండా తెలుగు సినిమాల పైరసీ ఓటీటీ కంటెంట్ ఉంది. దీంతో ఐ బొమ్మపై తెలుసు సినీ నిర్మాతలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రొడ్యూసర్ల ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేశారు.ఈ క్రమంలోనే ఐ బొమ్మ నిర్వాహకుడు పోలీసులకు సవాల్ విసిరాడు. తనను దమ్ముంటే పట్టుకోండి అంటూ పోలీసులకు సవాల్ విసరడం సంచలనంగా మారింది. ఈ కేసుపై ప్రత్యేక దృష్టి సారించిన పోలీసులు శనివారం రవిని అరెస్ట్ చేశారు. అతడు భార్యతో విడాకులు తీసుకుని ఒంటరిగా ఉంటున్నాడని సమాచారం. అరెస్ట్ అనంతరం అతడి అకౌంట్లో రూ.3 కోట్లను పోలీసులు ఫ్రీజ్ చేశారు. సర్వర్లు లాగిన్ చేయించి పైరసీ కంటెంట్ చెక్ చేశారు. అతడిని కోర్టులో ప్రవేశపెడతారని తెలుస్తోంది.

# శాతవాహన'లో ర్యాగింగ్ కలకలం





కరీంనగర్ కమాన్‌చౌరస్తా, (సందేశం టైమ్స్): శాతవాహన యూనివర్సిటీలో ఇటీవల జరుగుతున్న ర్యాగింగ్ ఘటనలు కలకలం రేపుతున్నాయి. అర్ధరాత్రి సీనియర్లు జూనియర్లతో మీటింగ్‌లు పెడుతూ ఇబ్బందులు పెడుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. 'రాత్రి 8.30 గంటలకు మీటింగ్ ఉంది. అందరూ తొందరగా మీమీ పనులు ముగించుకుని 233 రూంకి రండి. మీరు ఎంత తొందరగా వస్తే, అంతే తొందరగా ముగించుకుందాం.%ప్రతి ఒక్కరూ ఐసీ(ఇంట్రడక్షన్ క్లాస్) చెప్పాలి. ఎవరూ మిస్ కాకుండా రండి' అంటూ జూనియర్ విద్యార్థుల గ్రూప్‌లో సీనియర్లు పెట్టిన మెసేజ్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నది. ఆ సమావేశానికి వెళ్లిన విద్యార్థులను ఇంట్రడక్షన్ చెప్పాలంటూ, తడబడిన విద్యార్థులను డ్యాన్స్‌లు చేయిసన్తూ, పాటలు పాడిసన్తూ రాత్రిళ్లు నిద్రలేకుండా చేస్తున్నారని జూనియర్లు ఆందోళన చెందుతున్నారు. అలాగే, సీనియర్లు ఉన్న సమయంలో క్యాంటీన్‌కు రావద్దని, మెస్‌కు ఫార్మల్ డ్రెస్‌లో రావాలంటూ, అమ్మాయిలు, అబ్బాయిలు అని తేడా లేకుండా అందరినీ ఇబ్బందులకు గురిచేస్తున్నారని అసహనం వ్యక్తం చేస్తున్నారు.ర్యాగింగ్ గురించి కొందరు విద్యార్థులు రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేయగా, విషయం తెలుసుకున్న ఒక అధ్యాపకురాలు, జూనియర్లను పిలిపించి 'మీరు నాకు తెలియకుండా రిజిస్ట్రార్‌కు చెప్తారా..? సీనియర్లు అన్నాక ర్యాగింగ్ చేయరా..? స్పోర్టివ్‌గా తీసుకోవాలి. ఇలాంటి ఘటనలు జరుగుతూనే ఉంటాయి. టేకిట్ ఈజీగా తీసుకోండి' అంటూ మందలించినట్టు తెలిసింది. ర్యాగింగ్ ఘటనలతో యూనివర్సిటీలో గురువారం రిజిస్ట్రార్ ఆధ్వర్యంలో సీఐలతో ప్రత్యేకంగా యాంటీ ర్యాగింగ్ సమావేశం నిర్వహించారు. అందులో విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడవద్దని, అలాంటి కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ర్యాగింగ్ ఫిర్యాదులు వస్తే రానున్న రోజుల్లో ప్రభుత్వ ఉద్యోగాలు రావని, వారి భవిష్యత్ పాడవుతుందని మందలించి, ముగించారు.

# విచ్చలవిడిగా మొరం తవ్వకాలు



మంచిర్యాల,(సందేశం టైమ్స్): ఎలాంటి అనుమతులు లేకున్నా...అక్రమంగా మొరం తవ్వకాలు జరుపుతూ లక్షలు కొల్లగొడుతున్న వ్యాపారుల ఆగడాలకు అడ్డూ అదుపులేకుండా పోతోంది. అక్రమార్కులు అర్ధరాత్రి సమయంలో మొరం తవ్వకాలు జరుపుతూ ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. అక్రమార్కుల ధన దాహానికి కొండలు, గుట్టలు కరిగిపోతుండగా, నిత్యం లక్షల రూపాయలు చేతులు మారుతున్నాయి. దండేపల్లి మండలంలో ఈ అక్రమ బాగోతం కొద్ది నెలలుగా యథేచ్ఛగా జరుగుతోంది.దండేపల్లి మండలం గూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని రంగంపల్లె శివారు సర్వే నంబరు 444లోని ప్రభుత్వ స్థలంలో కొద్ది రోజులుగా కొందరు వ్యాపారులు అక్రమంగా మొరం తవ్వకాలు చేపడుతున్నారు. అర్ధరాత్రి సమయంలో మొరం తవ్వకాలు జరుపుతూ టిప్పర్ల ద్వారా గుట్టుచప్పుడు కాకుండా ఇతర ప్రాంతాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. నిత్యం సగటున 50 లారీల ద్వారా మొరాన్ని తరలిస్తూ ఒక్కో ట్రిప్పును 5,000 రూపాయల వరకు రియల్ ఎస్టేట్ వెంచర్లకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రతి రోజూ నిర్వహిస్తున్న అక్రమ దందా కారణంగా కనీసం రెండు లక్షల రూపాయల మేర చేతులు మారుతున్నట్టు సమాచారం. వ్యాపారుల ధన దాహం కారణంగా ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి పడుతుండగా, అక్రమార్కుల జేబులు నిండుతున్నాయి. ఈ అక్రమ దందా వెనుకాల కొందరు రాజకీయ నాయకుల హస్తం ఉన్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. నాయకుల ప్రమేయం ఉన్న కారణంగానే సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. దండేపల్లి రంగంపల్లెలో లభ్యమవుతున్న మొరం నాణ్యతతో కూడుకున్నది కావడంతో పెద్దఎత్తున డిమాండ్ ఉంది. ఆ మొరాన్ని రోడ్లకు ఉపయోగిస్తే వర్షాకాలంలో బురదమయం కాకుండా ఉండటంతో రియల్ ఎస్టేట్ వెంచర్ల నిర్వాహకులు దానిపై ఆసక్తి కనబరుస్తున్నట్లు తెలుస్తోంది. రెండునెలల క్రితం కూడా దండేపల్లి మండలంలోని అందుగులపేట గ్రామ శివారులో సర్వే నంబర్ 9లో విస్తరించి ఉన్న గుట్టలోనూ పెద్ద మొత్తంలో మొరం, మట్టి తవ్వకాలు జరిపారు. అలాగే మండలంలోని వందురుగూడ సమీపంలోనూ పెద్ద మొత్తంలో గుట్టలో మొరం, మట్టి తవ్వకాలు జరుపుతూ ఇతర ప్రాంతాలకు తరలించారు. మొరాన్ని తరలించేందుకు వ్యాపారులు భారీ వాహనాలు ఉపయోగిచడంతో రోడ్డు గుంతలమయంగా మారడంతో గ్రామస్థులు ఆందోళనకు దిగారు. దీంతో ఆ ప్రాంతంలో మొరం తవ్వకాలు నిలిచిపోయినప్పటికీ తాజాగా రంగంపల్లెపై అక్రమార్కుల దృష్టి పడింది. దండేపల్లి మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన గూడెం సత్యనారాయణస్వామి ఆలయం విస్తరించి ఉన్న సర్వే నంబరు 226లోని గుట్టలోనూ గుట్టు చప్పుడు కాకుండా అక్రమంగా మొరం తవ్వకాలు జరుపుతున్నట్లు సమాచారం. మండలంలోని వివిధ ప్రాంతాల్లో మొరం, మట్టి తవ్వకాలు జరుపుతున్న వ్యాపారులు వాటిని ప్రభుత్వ పథకమైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి తరలించేందుకు తమకు అనుమతులు ఉన్నాయని ప్రచారం చేస్తూ పబ్బం గడుపుతున్నారు. ఒకవేళ సంబంధిత అధికారుల నుంచి అనుమతులు ఉన్నా... నిబంధనల మేరకు తవ్విన మొరం, మట్టిని కేవలం ఇందిరమ్మ ఇళ్ల అవసరాలకు మాత్రమే వినియోగించాల్సి ఉంది. అదికూడా దండేపల్లి మండల పరిధిలో మాత్రమే లబ్ధిదారులకు అందజేయాలి. ఈ విషయం మైనింగ్ శాఖ జారీ చేసిన ప్రొసీడింగులోనూ పేర్కొనడం గమనార్హం. అలా ఇందిరమ్మ ఇళ్ల పేరుతో అనుమతులు పొందిన కాంట్రాక్టర్లు వివిధ ప్రాంతాల్లో తవ్విన మొరం, మట్టిని మండల పరిధులు దాటి ఇతర ప్రాంతాలకు తరలిస్తూ పెద్దమొత్తంలో సొమ్ము చేసుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

# జూబ్లీహిల్స్ లో కారు బీభత్సం .. తీరా వెళ్లి చూస్తే ...!



(సందేశం టైమ్స్):ప్రమాదంతో ఎయిర్‌బ్యాగ్స్ తెరుచుకోవడంతో తప్పిన పెను ప్రమాదం హైదరాబాద్ జూబ్లీహిల్స్ లో అర్ధరాత్రి ఓ కారు బీభత్సం సృష్టించింది. అతివేగంగా వెళుతున్న కారు అదుపుతప్పి విద్యుత్ స్తంభానికి ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఫిలిమ్ నగర్ పోలీసులు అక్కడకు వెళ్లి చూడగా ఒక్క సారిగా అవాక్కయ్యారు. ఓ యువతి పూటుగా మద్యం సేవించి కారు నడపడంతో ఈ ప్రమాదం జరిగినట్లు గుర్తించారు. డ్రైవింగ్ సీటులో యువతి ఇరుక్కుపోయి ఉండటంతో కారు అద్దాలు పగులగొట్టి ఆమెను సురక్షితంగా బయటకు తీశారు. ప్రమాద సమయంలో ఎయిర్ బ్యాగ్స్ తెరుచుకోవడంతో ఆమెకు పెనుప్రమాదం తప్పింది. ప్రమాదంతో షాక్ కు గురైన ఆమెను పోలీసులు చికిత్స నిమిత్తం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు.

# జూనియర్ కళాశాలలపై ఫోకస్



జగిత్యాల, (సందేశం టైమ్స్): జిల్లాలోని జూనియర్ కళాశాలపై ఇంటర్మీడియట్ బోర్డు ప్రత్యేక దృష్టి సారించింది. ప్రభుత్వ కళాశాలలను ఇప్పటికే ప్రక్షాళన చేయగా, క్షేత్రస్థాయిలో ఆచరణ, పరిస్థితులు అధ్యయనానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. దీంతో పాటు వేలల్లో ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలల్లో విద్యా బోధన, మౌలిక వసతులు తదితర అంశాలపై తనిఖీలు నిర్వహిస్తున్నారు. తనిఖీల వివరాలను రోజువారీగా ఆనలైనలో నమోదు చేస్తున్నారు. జీపీఎస్ ఆధారంగా తనిఖీలు చేపడుతుండడంతో కళాశాల యాజమాన్యాల్లో గుబులు పుడుతోంది. తనిఖీలతో ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లోని వాస్తవ పరిస్థితులు ప్రభుత్వానికి స్పష్టంగా తెలిసే అవకాశం ఏర్పడింది. దీంతో నిబంధనలు పాటించని కళాశాలలపై చర్యలకు ఉపక్రమించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లాలో ఇంటర్ విద్యాధికారి నారాయణ నేతృత్వంలో ఒక బృందం ఈనెల 11వ తేదీ నుంచి తనిఖీలు ప్రారంభించాయి. రాష్ట్ర స్థాయి అధికారులతో కూడిన మరో రెండు బృందాలు సైతం కళాశాలలను తనిఖీ చేయనున్నాయి. జిల్లాలో ప్రతీరోజూ రెండు నుంచి నాలుగు కళాశాలలను ఒక్కో బృందం తనిఖీ చేయాల్సి ఉంటుంది.జిల్లాలో 75 జూనియర్ కళాశాలలున్నాయి. ఇందులో 16 ప్రభుత్వ కళాశాలలు, 19 ప్రైవేటు జూనియర్ కళాశాలలు, 40 కేజీబీవీలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకుల కలాశాలలు, రెసిడెన్షియల్ కళాశాలలున్నాయి. వీటిని తనిఖీ చేసేందుకు ఇంటర్ బోర్డు మూడు బృందాలను ఏర్పాటు చేసింది. మొదటి బృందంలో డిస్ట్రిక్ట్ ఇంటర్ ఎడ్యూకేషన ఆఫీసర్ (డీఐఈవో) బొప్పరాతి నారాయణ, మరో బృందంలో ప్రత్యేకాధికారి (ఇంటర్ బోర్డు డిప్యూటీ సెక్రెటరీ) రమణారావు, ఇంకో బృందంలో డిప్యూటీ సెక్రెటరీ రాఘవలతో తనిఖీలు చేపడుతున్నారు. తొలి విడతలో డీఐఈవో నేతృత్వంలోని బృందానికి 44 కళాశాలలు, మరో రెండు బృందాలకు 12 కళాశాలల చొప్పున 24 కళాశాలల్లో తనిఖీలు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. కాగా జిల్లాలో 75 కళాశాలలుండగా 68 కళాశాలకు మాత్రమే షెడ్యూల్ వారీగా తనిఖీలకు కేటాయింపులు జరిపారు. ఏడు కళాశాలలకు షెడ్యూల్ కేటాయింపులో ఇంటర్ బోర్డు నిర్లక్ష్యం చూపింది. అయితే దానిని సరిదిద్దుకోవడానికి మిగిలిన ఏడు కళాశాలలను సైతం డీఐఈవో బృందంతో తనిఖీలు చేయిచండానికి నిర్ణయించినట్లు సంబంధిత వర్గాలు అంటున్నాయి.

# హైదరాబాద్‌లో విషాదం.. భార్య కేసు పెట్టిందని సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య

(సందేశం టైమ్స్): భార్య తనపై పోలీసులకు ఫిర్యాదు చేసిందన్న మనస్తాపంతో హైదరాబాద్ భోలక్‌పూర్ కృష్ణానగర్ కు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన గాంధీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది.వివరాల్లోకి వెళితే.. కృష్ణానగర్‌కు చెందిన విశాల్ గౌడ్ (28) టీసీఎస్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. అతనికి 2023 డిసెంబర్‌లో మల్లాపూర్‌కు చెందిన నవ్య (25)తో వివాహమైంది. పెళ్లయిన కొన్ని రోజులకే ఇద్దరి మధ్య గొడవలు మొదలయ్యాయి. పలుమార్లు పెద్దలు సర్దిచెప్పినా వారి మధ్య సఖ్యత కుదరలేదు. ఈ క్రమంలో ఈ ఏడాది మార్చిలో పుట్టింటికి వెళ్లిన నవ్య తిరిగి రాలేదు.రెండు నెలల క్రితం నవ్య తన భర్త విశాల్‌పై ఉప్పల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు విశాల్‌ను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆ తర్వాత కేసు నమోదు కావడంతో మరోసారి స్టేషన్‌కు రావాలని ఫోన్ చేశారు. పోలీసుల నుంచి ఫోన్ రావడంతో తీవ్ర ఆందోళనకు గురైన విశాల్, ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.కుటుంబ సభ్యులు తలుపులు పగలగొట్టి చూడగా, అప్పటికే అతను ప్రాణాలు కోల్పోయాడు. తమ కుమారుడి మృతికి కోడలు నవ్య, ఆమె కుటుంబ సభ్యుల వేధింపులే కారణమని విశాల్ తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. వారి ఫిర్యాదు మేరకు గాంధీనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

(Sandesham Times) TG TEL/25/A0348"Title: Sandesham Times"Address: 3-82, Ananthagiri, Singavaram, Suryapet, Telangana – 508 206"Email:sandeshamtimes@gmail.com | Website: https://sandeshamtimes.com. Publisher & Printer: Amrutha Venkat Media Publication Private Limited,"3-82, Singaram, Ananthagiri Mandal, Suryapet District, Telangana – 508206" Phone: 9052045435."Printed at: Sunday Printing Press,"3-4297, Saraswathi Complex, SVN Colony, Guntur, Andhra Pradesh – 522 006